26082024-DIS-04_Layout 1 8/26/2024 3:41 AM Page 1



# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి... editpage@ntnews.com




# వర్సిటీకి పాల్కుర్కి పేరు సముచితం

**తెలుగు భాషా సంస్కృతులకు, చరిత్రకు 'తెలంగాణ' తొట్ట తొలుత వికాస కేంద్రంగా నిలిచింది. ఆ తర్వాతే మిగతా తెలుగు నేలకు సంస్కృతీ వికాసం విస్తరించింది. అలాంటి బంగారు నేలపై వెయ్యేండ్లకు పైగా చారిత్రక సాక్ష్యంగా నిలిచిన భాగ్యనగరం నేడు తెలుగు వారలకు వికాసభూమి, నివాస భూమి, వ్యాపారకేంద్రం, విద్యల నిలయంగా నిలిచింది.**

ఈ హైదరాబాద్ మహానగరంలోని విద్యా వికాసానికి కేంద్ర స్థానాలైన విశ్వ విద్యాలయాల్లో తెలుగు విశ్వ విద్యాలయం ఒకటి. నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు మానసపుత్రికగా, ఆయన హయాంలో అన్ని కళా కేంద్రాలను అంతర్గర్భీకరించుకొని నగరం నడి బొడ్డున అందరికీ అందుబాటులో నాంపల్లి కేంద్రంగా డిసెంబర్, 2 1985లో తెలుగు విశ్వవిద్యాలయం వికసించింది. దీన్ని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో 1998లో 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం'గా పేరు మార్చినారు. సంస్కృతం, జ్యోతిషం, క్లాసికల్ తెలుగు, నృత్యం, సంగీతం, చరిత్ర, ఇతర కళలు ఇలా అనేక సంస్కృతీ విభాగాలకు విద్యార్జన కేంద్రమైంది.

> **ప్రస్తుతం ఉమ్మడి రాష్ట్రం రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయి పదేండ్లు గడిచిన కారణంగా అన్ని అంశాల్లో విభజన అయి, ఈ విశ్వవిద్యాలయం కూడా ద్విధావిభక్తం అవుతోంది. తెలంగాణ విభాగానికి అనగా హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి నామీకరణం, నామీకరణం దిశగా ప్రయాణిస్తున్నది. సురవరం ప్రతాపరెడ్డి పేరును ఇదివరలో కొందరు సూచించారు.**



అయితే, ఇవి ఆధునిక విద్యా విషయాల విశ్వవిద్యాలయాలు కావు. ప్రాచీన సాహిత్యం, సంస్కృతీ, కళల నిలయాలు. వీటికి ప్రాచీనుల పేర్లు తగినవిగా ఉంటాయి. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం (రాజమండ్రి), వేమన విశ్వ విద్యాలయం (కడప), తిక్కన విశ్వవిద్యాలయం (నెల్లూరు) వంటి పేర్లతో ఆంధ్రులు వాటిని సముచితంగా గౌరవించుకున్నారు. తెలంగాణలోని ఈ విశ్వవిద్యాలయానికి ప్రాచీన తెలుగు కవులు లేరా? పేర్లు దొరకవా? ఆధునిక తెలంగాణ వైతాళికుల పేర్లు పెట్టాలా? అనేది ప్రశ్న.

బాగా ఆలోచిస్తే తెలంగాణకు ప్రాచీన సాహిత్య మణి కిరీటంలోని శిరోమణి వంటి పాల్కుర్కి సోమనాథుడున్నాడు. ఇతడు తెలంగాణకే కాదు, తెలుగు సాహిత్యానికే 'స్వతంత్ర తొలి తెలుగు కవి.' ఈతని శిష్ట సాహిత్యం, పద సాహిత్యం, శతక సాహిత్యం, స్తుతి సాహిత్యం పండితులకు పామరులకు ఉపాదేయమైంది. మిగిలిన కవులెలా ఉన్నా, ఈయన పేరు తెలియని తెలుగు వాడుండరు. ప్రసిద్ధుడైన ఈ మహాకవి తెలుగు సాహిత్య లోకానికే స్ఫూర్తిదాత. తెలంగాణ జాతికి నిత్యః ప్రాతః స్మరణీయుడు. అంతేకాదు, అత్యంత ప్రాచీనుడు. ఈయన కాలం 11వ శ. అంతం. ఇంత ప్రాచీనుడైన ప్రతిభావంతుడైన మహాకవి మరొకరు లేడు.

తెలుగు భాష ప్రాచీనత్వం కోసం తెలంగాణ సాహిత్యాన్నే ఆధారంగా తీసుకొని ప్రాచీన హోదాను కేంద్రం నుంచి వాదించి, గెలిచి తెచ్చుకున్నాం. అలాంటి మనం ఓ విశ్వవిద్యాలయానికి అందులో ప్రాచీన సంస్కృతీ కళలకు పట్టుకొమ్మ అయిన విశ్వ విద్యాలయానికి ఒక ప్రాచీన మహాకవి పేరు పెట్టుకోలేమా? అసలు పాల్కుర్కి అధ్యయనాంశంగా ఒక పీఠమే ప్రభుత్వం ఏర్పర్చాలి. అలాంటిది. ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఈ తెలుగు విశ్వవిద్యాలయానికి ఈ మహాకవి పేరు పెట్టుకోవడం ఎంతో సముచితం. అందరికీ సమ్మతంగా ఉండే భేషైనా కీర్తి మంతమైన చర్య. ముఖ్యమంత్రి, విద్యామంత్రులు ఈ విషయంగా పరిశీలించగలరని మనవి.

అయితే, సురవరం ప్రతాపరెడ్డి గారి పేరు సంగతేమిటని ఒక ప్రశ్న తలెత్తుతుంది. వీరు తెలంగాణలోని ఆధునిక సాంస్కృతిక వైతాళికుల్లో ఆద్యగణనీయుడు. ఈయన తెలంగాణలో పుట్టకుంటే, తెలంగాణ సంస్కృతీ, కళావారసత్వం, రాజకీయ వికాసం ఒక వందేండ్ల వెనుకకు ఉండేదంటే అతిశయోక్తి కాదు. మరి అలాంటి మహానుభావుడి పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టరాదా అని ప్రశ్న. అయితే, ఒక ప్రాచీన మహాకవి కోసం తపించి, పాల్కుర్కి సోమనను గణనలోకి తీసుకున్నాం.

సురవరం ప్రతాపరెడ్డి పేరును ఒక విశ్వవిద్యాలయానికి పెట్టవలసిందే. అంతటి యోగ్యత వారిది. ఆ బాధ్యత మనందరిది. ప్రస్తుతం పాలమూరు విశ్వవిద్యాలయం ఉంది. ఇది కొత్త విశ్వ విద్యాలయాల్లో ఒకటి. పైగా ఈ విశ్వవిద్యాలయం సురవరం వారి సొంత జిల్లాలోనిది. వారు ఆ జిల్లా వాసులే గనుక, వారిపేరు ఆ విశ్వవిద్యాలయానికి పెడితే సముచితంగా ఉంటుంది. 'సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం, లేదా సురవరం ప్రతాపరెడ్డి పాలమూరు విశ్వవిద్యాలయం' అన్నా సముచితంగా ఉంటుంది. అంతేకాదు తెలంగాణ రాష్ట్ర వాసులందరే కాక విశేషించి పాలమూరు జిల్లా స్థానికులు కూడా బాగా హర్షిస్తారు. ప్రతాపరెడ్డి గారంటే అభిమానించే వారు కూడా ఈ నిర్ణయాన్ని గౌరవిస్తారు, ఆహ్వానిస్తారు. సురవరం వారికి గూడా మనం ప్రేమపూర్వకంగా, నివాళి అర్పించినట్టుంటుంది. ఒకరు ప్రాచీన వైతాళికునిగా, మరొకరు ఆధునిక తెలంగాణ వైతాళికునిగా ఉభయులను 'పాల్కుర్కి సోమన, సురవరం ప్రతాపరెడ్డి గారలను' సంభావించి, సముచిత గౌరవమిచ్చి తెలంగాణ జాతికి వారిచ్చిన అమూల్య సంస్కృతీ వారసత్వాన్ని గౌరవించుకున్నట్టుంటుంది. ఈ దిశగా ముఖ్యమంత్రి గారు, ప్రభుత్వం ఆలోచించవలసిందిగా మనవి చేస్తున్నాం.



**డాక్టర్ సంగనభట్ల నరసయ్య**
94400 73124

> **తెలుగు భాష ప్రాచీనత్వం కోసం తెలంగాణ సాహిత్యాన్నే ఆధారంగా తీసుకొని ప్రాచీన హోదాను కేంద్రం నుంచి వాదించి, గెలిచి తెచ్చుకున్నాం. అలాంటి మనం ఓ విశ్వవిద్యాలయానికి అందులో ప్రాచీన సంస్కృతీ కళలకు పట్టుకొమ్మ అయిన విశ్వ విద్యాలయానికి ఒక ప్రాచీన మహాకవి పేరు పెట్టుకోలేమా? అసలు పాల్కుర్కి అధ్యయనాంశంగా ఒక పీఠమే ప్రభుత్వం ఏర్పర్చాలి. అలాంటిది ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఈ తెలుగు విశ్వవిద్యాలయానికి ఈ మహాకవి పేరు పెట్టుకోవడం ఎంతో సముచితం.**

## చదువు స్వభావము

చదువ దేలయన్న పదము పలుకరాదు
చదువు లేనివాడు జంతుసముడు
బతుకు బాగుపడగ బాటవేయు చదువె
చీకటందు వెలుగు రేకవోలె

ధనము కొరకు చదువులను క్రయ మిలన
బేరసారములకు దారి కాదు ఇది
చింతల దీర్చు చింతామణి వలెను
చదువు జీవితమును చక్కబరుచును

మీరు పొందలేని భూరి విద్యలనన్ని
సంతును చదివించ పంతమూని
పాల మనసులందు పని యొత్తిడిని పెంచ
తల్లిదండ్రులార తగదు మీకు

ధనము పొందుటొకటె ఘనముగా నెంచెడు
వ్యక్తిగతములైన బడులు నేడు
విద్య నేర్పుటందు విఫలమగు చునుండె
పుత్తడనుచు పోవ నిత్తడౌను

తెలివి యెంతయున్న కలుగునంత చదువు
బలిమి చేత రావు ఫలములెపుడు
నీటనీదు చేప నింగిలో నెగురుట
సాధ్యమగునె ధరను శ్రమయెగాక

విషయమేదైన శ్రద్ధగ వివరమరసి
చదువుకొన్ననె లాభము సంఘమందు
కొన్ని మాత్రమే మంచిని కూర్చునెడు
భావదారిద్ర్యమును వీడు త్రోవగనుడు



**చిలకమర్తి కృష్ణమాచార్యులు**





## మూలవాగు

మా ఊరి మూలవాగు
ఇసుక దేహంపై నీటి కొంగు సుట్టుకొని
కస్కెలు, శంఖులతో అలుగు దుంకితే
పట్టగొలుసులు పెట్టుకున్న ఆడబిడ్డ లెక్క ఉంటది.
అది సుడులు సుట్టుకొని సప్పుడు చేసే నీటి రాగానికి
కోటి కొంగలైన ఒంటికాలి
జపంతో ఎదురుసూడాల్సిందే...
దాని లెక్కల
పొర్కనీ, గడ్డిని తనతో కొంచవోయిందంటే
ముసలోళ్ల మంచి చెడ్డలర్సుకునే
పెద్ద మనిషైనట్టే...
అలిగి కూసున్నదంటే ఎండకాలం వచ్చినట్టే..
చలాకి ఉన్నదని
గవర్నమెంటోళ్లు చెక్‌డ్యామ్ కట్టి ఏడాదైనా కాలె
ఏ పాపపు దళారోడి కన్ను పడ్డదో ఏమో
నీటి కొంగు తొలచి వివస్త్రను చేసింద్రు
ఇసుక దేహాన్ని అమ్ముకొని
రాక్షసానందం పొందిన్రు
పాపం వాగు ఇప్పుడు మిగిలిన దుబ్బతో
నోరి తెర్సి ఎదురుచూసే పొలం
లెక్క బీటలు వారి చూస్తున్నది
ఎవరైనా చెరువు నీళ్లతోనైనా
గొంతు తడుపుతారని
ఒక నీటి బట్టను మళ్లీ సుట్టి పోతారని.



**సందీప్ వొటారికారి**
93902 80093

# శబ్దార్థ హృదయ సంవేదన

**యదార్థభావం వ్యథార్థ రూపంలో బయటపడితే అది ఫణి మాధవి కవిత్వం. రామాయణ మహా కావ్య సృజన కూడా శోకం నుంచే శ్లోకమై, కథనమై, కవిత్వమై, ఇతిహాసమై, చారిత్రక ప్రమాణమై, భారతీయ జీవన వేదమై భాసించింది. కాంతి పుంజానికి వెనకాల చీకటి ఉన్నట్లు సంతోషం వెనక దుఃఖం ఉంటుంది. సామభేదలో కవిత్వం అర్థవంతమై, వేదనారోదనలలో భేదం భావ యుక్తంగా రక్తి కట్టినది.**

బాధతో నిండిన హృదయంలో మొలకెత్తిన భావ జ్వాలలకు ఆలోచనాజ్యం పోసి అక్షరాలలో ప్రజ్వలింపజేశారు ఫణి మాధవి. వామపక్ష వాద కవుల ప్రభావం ఆమెపై ఒకింత ఎక్కువగానే ఉంది. అందుకే ఆ భావన ఆమె కవితల్లో తొంగిచూస్తూనే ఉంటుంది. సచేతనమైన శరీరం నిర్జీవమైతే, బాహ్య ప్రపంచ బంధాల నుంచి విడుదలైనప్పుడు అది మరణమవుతుంది. ఆ మరణానికి కూడా కబురంపట మంటే!..





**'మొన్న ఆఖరిసారిగా**
**మరణించినప్పుడు**
**శోకగానం ఆలపించలేదేం!?'** అంటూ మరణం గురించి సరికొత్తగా చెప్పారు.

**'దెబ్బ కాయటం తెలుసులే-- కానీ**
**రాయికెందుకో ఉబలాటం**
**పదేపదే గాయపరచడమే లక్ష్యం'..** అంటూ

రాళ్లలోనూ మనసు ఉంటుందని కొంగొత్తగా చెప్పారు. కనిపించకుండా విసిరిన చేయి అసలు ముద్దాయిగా తెలిశాక, తగిలిన గాయాన్ని సాక్ష్యంగా చూపెడుతుంది. మానవ జీవన జనన మరణ పరిభ్రమణంలో ఇది అనివార్యం. చనిపోయిన ప్రతిసారి కొత్తగా పుట్టక తప్పదు. ఆ పుట్టుక ఎలాంటిదనేదే ప్రశ్నార్థకమవుతుంది. బతకటం కష్టమైనప్పుడు మరణం అనివార్యమే కదా! ఇది చర్వితచరణం. అది కొత్తేమీ కాదు, కొత్తగా తెలుసుకున్నట్టు అనుకుంటాం. అదే మానవ జీవితంలో విచిత్రం. 'కబురు' కవితలో ఈ ధ్వని ఉంటుంది.

**'జై రామ రాజ్యంలో**
**రావణ రథం ఊరేగుతుంది**
**పాండవ ధర్మ పాలనలో**
**కీచక జయధ్వానాలు**
**మిన్నంటుతున్నాయి'** అంటూ

మతోన్మాదులను, వేర్పాటు వాదనను సమర్థించేవాళ్లను అందలాలు ఎక్కిస్తే దుర్మార్గమే రాజ్యమేలుతుందని చెప్పారు.

అఘాయిత్యాలు చేసేవాళ్లు కూడా అభినందనల కరచాలనం చేస్తారని, అవకాశం దొరికితే ఆబగా కబళించాలని చూస్తారని, తన భావాలు అరణ్య రోదనలేనని, కుచించుకుపోయిన ఆడతనం మహిళా దినోత్సవానికి పెద్దగా స్పందించదని.. మనుషులు పరిణతి చెంది మహిళల్లో తల్లిని, చెల్లిని చూడగలిగితే నిర్భయంగా తన భౌతిక దేహంపై మోజు పడని మగరాయుళ్ల ముందు కూడా ధైర్యంగా వెళ్లగలిగితే, అది నిజమైన మహిళా దినోత్సవమనేది కవయిత్రి ఉవాచ.

**'తన అరుపులు**
**అరణ్య రోదనలేనని**
**ఆమె మౌనంగా**
**తిరుగు పయనమైంది' అంటూ**
**'ఎప్పటిలాగే ఎప్పటిలాగే'**

కవితలో తన ఆంతర్యాన్ని చెప్పారు కవయిత్రి. నాన్న లేని కుటుంబ వేదన చెప్పినా, అమ్మే నాన్నయిందని అమ్మని ఆకాశానికెత్తినా,

**'పూర్ణం మిగలాలంటే**
**పూరించాల్సిందేదో ఉంది**
**అర్థం చేసుకోలేని ఆల్గారిథం**
**బతుకు పుస్తకం నిండా'** అని గణితం చెప్పినా, కిం కర్తవ్యంలో లోపలి చీకటిని పదాల్లో ఒంపినా, పెదాలపై పూసిన నవ్వును మనసుకు పట్టించుకోవడం, దేనికోసమంటే..

**'చేతనకు రాదారి చీకటేనని**
**నిజాన్ని ఎరుక బట్టటం'**
అని చెప్పినా కవయిత్రికే చెల్లుతుంది.

చివరి కవిత 'వెన్నుచూపకు'లో 'మనసు ఉక్కిరిబిక్కిరైనప్పుడు పక్కన కిటికీ తెరుస్తుంది. స్వచ్ఛమైన గాలిని ఆస్వాదిస్తూ, ఊపిరి ఒరిపిడిలోనూ భావం వదల్లేదని చెబుతుంది. గదిలోని చీకటి కాటుకలా నల్లనిదైనా దానిని ఏ వెలుగూ మసక బార్చదు' అంటుంది కవయిత్రి. మధ్య పుటలలో మానవ జీవిత సంగ్రహ సారాన్ని..

**'ఉరిమే ఉరుముల మబ్బులలో**
**మెరిసే మెరుపుల తళుకులలో**
**కురిసే వడగళ్ల వర్షపు చినుకులు'**గా కవి త్వీకరించారు. సామభేద గురించి చెప్పాలంటే ఇంకా చాలా ఉంది. ప్రతిఒక్కరూ చదవాల్సిన మానవ జీవన సంవేదనలు కలగలిసిన కవిత్వ సంపుటి సామభేద.



**వేంకట రాణా ప్రతాప్**
93984 32567



## నేను తెలంగాణను

కోస్తా కన్నా ముందే నా గడ్డ నివాస యోగ్యమని
మానవ నాగరికత వికసించిన ఘనత నా నేలది!
అశ్మక ములక ముషక గణ రాజ్యాలన్నీ
బౌద్ధం కన్నా ముందే విలసిల్లిన చరిత్ర నాది!
కోటి లింగాలలో స్వాతంత్ర్యం ప్రకటించిన
శ్రీముఖ శాతవాహన రాజ్యాధికారం నేనే!
**॥నేను తెలంగాణను - తెలుగు ఆణెమును॥ 2**

వాత్స్యాయనుడు నాగార్జునుడు కుతూహలుడు కుమారిలుడు
దార్శనికతతో వెదజల్లిన బౌద్ధ పరిమళం నేనే!
విష్ణుకుండిన గోవిందవర్మ తామ్ర శాసనం
నా గడ్డమీది తొలి శిలా దాన శాసనం!
జనాశ్రయుని ఛందో విచ్ఛిత్తిలోని సీస పద్యలక్షణమూ
అచ్చమైన తెలుగు ఛందో పద్య రచనకూ తార్కాణం నేనే!
**॥నేను తెలంగాణను - తెలుగు ఆణెమును॥ 2**

'ఏకోరసః కరుణ ఏవ' సిద్ధాంతకర్త భవభూతి
నాటకాల జన్మస్థలం ప్రదర్శన క్షేత్రం విదర్భ నాదే!
గుజరాతు లాట దేశ చాళుక్యులు మొదటగా
వలస వచ్చిచేరిన పోదన (బోధన్), వేములవాడ రాజధానులు నేనే!
చాళుక్యుల కళా సాహిత్య పోషణలో విరాజిల్లిన
విలసిల్లిన వేములవాడ, కొలనుపాక ఆలయాలు నేనే!
**॥నేను తెలంగాణను - తెలుగు ఆణెమును॥ 2**

యశస్తిలకుడు సోమదేవసూరి
కథాసరిత్సాగర కవనధారి ఆశ్రయం నాదే!
కన్నడ భారత కవి పంపని జినేంద్ర పురాణం
భాష ప్రాచీనతకు కట్టిన పట్టాభిషేకం నాదే!
జినవల్లభుని గంగాధర (కురిక్యాల) శాసన కందపద్యాలు
ప్రాచీన పద్య వైభవ ప్రాభవాలు నేనే!
**॥నేను తెలంగాణను - తెలుగు ఆణెమును॥ 2**


(క్రీ.పూ. బౌద్ధం పూర్వం నుంచి
క్రీ.శ. 11వ శతాబ్దం పూర్వం వరకు
తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవం)



**డాక్టర్ బోయినపల్లి ప్రభాకర్**
9490901050

# దాశరథి – జీవననాదం

**తెలుగు సాహిత్యంలో జీవిత కథలు.. జీవన ప్రయాణాల చరిత్ర నిక్షిప్తాలు కొత్త కాదు. అతడు-ఆమె.. కాశీ యాత్ర నుంచి దాశరథి 'జీవనయానం' వరకు సుసంపన్నమైన సాహితీ భాండాగారం తెలుగు జాతిది. దాశరథి రంగాచార్యులు ఆంధ్రదేశపు రాజకీయ, సాంఘిక, సామాజిక చరిత్రతో సమాంతరంగా పయనించి రచనలు చేసిన సాహితీ స్రష్ట. నాడు-నేడు పై అంశాలలో పది నవలలు పేర్కొంటే వాటిలో సగం దాశరథి రచనలే ఉంటాయి. మోదుగు పూలు, చిల్లర దేవుళ్లు వంటివి కొన్ని మాత్రమే.**




దాశరథి రంగాచార్యకు వేదం తెలుసు, జీవననాదం తెలుసు. అతని సోదరులు దాశరథి కృష్ణమాచార్యులు అక్షరాలతో అగ్నిధారలు కురిపించిన కవి. సినీ గేయ రచయితగానూ సుప్రసిద్ధులు. తమ్ముడు దాశరథి రంగాచార్యులు ఆధ్యాత్మిక సాహితీ శిఖరంలా వెలిగారు. తెలుగు సాహిత్యాన్ని అన్ని ప్రక్రియలలో సుసంపన్నం చేశారు. 'పలికెడిది భాగవతమట పలికించెడువాడు రామభద్రుడని' వినయంగా చెప్పుకొన్న పోతన మాదిరిగా అత్యంత వినయంతో 'నేను నాలుగు వేదాల వచనానువాదం- కేవలం భగవదనుగ్రహంతో (24-1-1998 నాటికి) పూర్తి చేశాను' అన్నారు రంగాచార్యులు. వేదం ఆయన ప్రాణం, జీవననాదం. తెలుగుజాతి (కాదు.. భారతీయ) సంస్కృతి. సంప్రదాయ జీవనాడి ఆధారం.

'అన్ని వేదాల్లోనే ఉన్నాయిష' అన్న కన్యాశుల్కం వాక్కు అక్షర సత్యం. దాశరథి రంగాచార్యులు అక్షర నిధులతో రుజువు చేసిన వాస్తవం. 'ఈ మానవ జీవితం - సమాజ జీవితం - నాగరికత - సంస్కృతి అన్నీ వేదం నుంచి అవతరించినవే! జీవననాదం వేదం నుంచి ఆవిర్భవించింది' అని ఆయనే చెప్పుకున్నారు. వేదం మానవజాతికి వెలుగు ప్రసాదించింది. కనువిప్పు కలిగించింది. జీవననాదం వినిపించింది. జీవనాధారం చూపింది. జీవనసారం బోధించింది. దాశరథిగారి అక్షరరమ్యతను, జీవనానుభవాన్ని, జీవన సూత్రాల విస్తరణను ఈ చిన్న వ్యాసంలో వివరించడం సాధ్యం కాదు. ఆయనది సాహితీ వామనుని విశ్వరూప సందర్శనం. సాహిత్యంలో వేదానికి సంబంధించిన అతి సరళమైన వచనంతో వెలువడిన గ్రంథం 'వేదం జీవనాదం'.

> **దాశరథి జ్ఞాన సంపాదన సూత్రం వేదం. ఈ రచనలో ఆయన చరిత్ర, పోరాటాలు, సామాజికంగా 'మనిషి'లో కలిగిన పరిణామాలు, మృత్యు పరిష్వంగనలు వంటి వాటితో పాటు స్త్రీ సాధికారత కోసం ప్రారంభమైన పోరాటాలు ఈనాటివి కావని, నాటి రామాయణ, మహాభారత కాలాల నుంచి ఉన్నాయనేది ఇతిహాసపు రుజువులతో వివరిస్తారు.**

ఇతిహాసాల చరిత్రలో మహిళా విముక్తి ఉద్యమాల గురించి ఆయన స్థాలీపులాకన్యాయంగా ఉదహరించారు. ఇందుకు ఉదాహరణలుగా- మహిష్మతి నగరాన్ని పరిపాలించిన నిషధుడు, విశ్వామిత్రుడు- మేనక, మమత, బృహస్పతి వృత్తాంతాలను ప్రస్తావిస్తారు. యవనాశ్వుడు అనే ఇక్ష్వాకు వంశరాజు గురించి వివరించే క్రమంలో మగవారి గర్భధారణ గురించి ఆశ్చర్యపోయే అంశాలను అత్యంత సరళంగా, స్పష్టంగా చెప్పారు. కృత్రిమ సంతానం (టెస్ట్ ట్యూబ్ బేబీ) ఉదంతాన్ని ఐతిహాసిక ఆధారాలతో వివరించిన వైనం దాశరథి వేద విజ్ఞాన పటిమకు నిదర్శనం. ఏ ప్రక్రియ తీసుకున్నా ఆయన తనదైన ముద్రనే వేశారు. అక్షరాలకు భారతీయ ఆత్మతో కూడిన సంప్రదాయాత్మకమైన తాత్వికతనద్దిన ఆధ్యాత్మిక శీలి దాశరథి.

దాశరథి రంగాచార్యులు తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధుడు. కలం వీరుడు. 1928 ఆగస్టు 24న మహబూబ్ నగర్ జిల్లాలోని చిన్న గూడూరులో జన్మించారు. మార్క్సిజం, సంప్రదాయం భిన్న ధ్రువాలు. ఆ రెండింటి లక్ష్యం ఒక్కటే అయినా దారులు వేరని గ్రహించిన దాశరథి నూతన చక్షువులతో సంప్రదాయాన్ని మార్క్సిజం దృక్పథంతో, మార్క్సిజాన్ని మానవతాదృక్పథంతో అనుసృజన చేశారు. ఉద్యమకాలంలో భారత, రామాయణాలను వ్యతిరేకించినా, స్వాతంత్ర్యం సిద్ధించి ఉద్యమాల నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన దృక్పథంలో మార్పు వచ్చింది. నవలలు, కథలు, కవిత్వం, అనువాదాలు, వ్యాస సంకలనాలు వెలువరించారు. వేద సాహిత్యాన్ని, భారత, భాగవత, రామాయణాలను తమదైన శైలిలో రచించారు. ఆయనకు అనేక పురస్కారాలు లభించాయి. 2015 జూన్ 7న తన 86వ ఏట ఆయన మరణించారు. జాషువా అన్నట్టు 'కవియు మరణించె ఒక తార గగనమెక్కె'. ప్రజల నాలుకలపైన, సాహితీ సహృదయులు నిరంతరం స్మరించుకునే చిరస్మరణీయులు దాశరథి రంగాచార్యులు.



**భమిడిపాటి గౌరీశంకర్**
94928 58395

## ప్రకటనలు

### 'రాత్రిసింఫని'కి సాహితీ అవార్డు

ప్రముఖ కవి డాక్టర్ బాణాల శ్రీనివాసరావు రచించిన 'రాత్రి సింఫని' కవితా సంపుటం 2023కు గాను పాలమూరు సాహితీ అవార్డుకు ఎంపికైంది. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 1న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో గల కాళోజీ హాల్‌లో ఉదయం 10 గంటలకు జరుగుతుంది. అందరూ ఆహ్వానితులే.

**- డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్**
వ్యవస్థాపకులు, పాలమూరు సాహితీ అవార్డు